క్లుప్తంగా

డ్రాగన్‌ఫ్రూట్ తోట సందర్శన

దమ్మపేట: డ్రాగన్ ఫ్రూట్ తోటను కలెక్టర్ ప్రియాంక ఆల మంగళవారం సందర్శించారు. అశ్వారావుపేట పర్యటనకు వెళ్తున్న ఆమె మార్గ మధ్యలో మండలంలోని గుర్వాయిగూడెం శివారు డ్రాగన్ ఫ్రూట్ తోట వద్ద ఆగారు. తోట అంతా కలియదిరిగిన కలెక్టర్.. సాగు విధానం పై ఆరా తీశారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి మరియన్న, తహసీల్దార్ ముజాహిద్, ఏడీ అఫ్జల్ బేగం, హెచ్‌ఓ సందీప్, ఏఓ చంద్రశేఖర రెడ్డి, ఏఈఓ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రం ప్రారంభం

ములకలపల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ, కిన్నెరసాని ఆధ్వర్యంలో ములకలపల్లిలో మంగళవారం కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ పేదరిక నిర్మూలనా దినోత్సవాన్ని పురస్కరించుకుని, మండలకేంద్రంలోని హనుమాన్‌టెంపుల్ వీధి, పాతపోస్టాఫీస్ రోడ్‌లో టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షుడు రాయల కేధారేశ్వరరావు పాల్గొని, కేంద్రాలను ప్రారంభించారు. క్లబ్ సెక్రటరీ రేపాక ప్రసాద రావు, సభ్యులు కుంజా జగన్, అరవింద్ సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శివకుమార్

మణుగూరురూరల్: మండల పరిధిలోని విజయనగరం గ్రామంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. పలువురు జ్వరపీడితుల రక్తన మూనాలను సేకరించి జాగ్రత్తలు సూచించారు. షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు సైతం మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ అనూష, సూపర్‌వైజర్ పుష్పారాణి, రాంప్రసాద్, శైలజ, రవి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

దమ్మపేట: కోఆపరేటివ్ సొసైటీలో రైతులకు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని సొసైటీ చైర్మన్ రావు జోగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. యూరియా, పొటాష్, 28–28 రకం ఎరువులు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ కాపీలను కార్యాలయంలో అందజేసి పొందవచ్చని తెలిపారు. సొసైటీలో మొత్తం 591 మంది రైతులకు ఋణమాఫీ జరిగిందని, ఆ రైతులు పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంక్ ఖాతా పుస్తకం వివరాలను కార్యాలయంలో అందజేసి, ఋణమాఫీ పొందిన మొత్తం నగదును రైతులు తిరిగి రుణంగా పొందవచ్చని తెలియజేశారు.

20న సీపీఐ సమావేశం

మణుగూరుటౌన్: ఈ నెల 20వ తేదీన సీపీఐ మణుగూరు మండల, పట్టణ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య తెలిపారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనరల్‌బాడీ సమావేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన విధానాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు సరెడ్డి పల్లారెడ్డి, మున్న లక్ష్మీకుమారి, ఆర్.లక్ష్మీనారాయణ, జంగం మోహన్, దుర్గ్యాల సుధాకర్, తోట రమేశ్, అక్కి నర్సింహారావు, సర్వర్, కుటుంబరావు, కణితి సత్యనారాయణ, రాజబాబు, వీరయ్య, కన్నబోయిన ప్రసాద్ తదితరులు ఉన్నారు.

మండల అధ్యక్షుడిగా నియామకం

బూర్గంపాడు: బహుజన సమాజ్‌పార్టీ మండల అధ్యక్షుడిగా పాయం సింగరాజును నియమించారు. ఇందుకు సంబంధించి మంగళవారం నియామకపు ఉత్తర్వులు అందించారు. పార్టీ అభివృద్ధికి, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ గెలుపు కోసం కృషి చేస్తానని సింగరాజు ఈ సందర్భంగా అన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని కల్యాణపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బాణోత్ చంద్రు పాము కాటుకు గురై మణుగూరులో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మంగళవారం ఎమ్మెల్యే రేగా కాంతారావు సతీమణి రేగా సుధారాణి ఆస్పత్రిలో పరామర్శించారు. ఆరోగ్య వివరాలు తెలుసుకుని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న మండల పరిధిలోని చింతిర్యాల క్రాస్‌రోడ్డు గ్రామానికి చెందిన తోటమళ్ల నిర్మలను సుధారాణి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రహదారులు

- రెండేళ్ల కిందట వరదలతో ధ్వంసం
- ఆపై ఇసుక లారీలతో మరింత ఆగం
- ప్రమాదాలకు నెలవుగా మారిన వైనం
- పట్టీపట్టనట్లుగా శాఖాధికారులు



దేవరాపల్లి సమీపంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంత

చర్ల: ఆర్‌అండ్‌బీ రహదార్లు అధ్వానంగా తయారయ్యాయి. రెండేళ్ల క్రితం వచ్చిన గోదావరికి వరదలు రహదార్లను ముంచెత్తడం, భారీగా కురిసిన వర్షాలకు రహదార్లపై నీరు ప్రవహించడంతో రహదారి పలుచోట్ల కృంగి పోగా దానిపై ఓవర్ లోడ్‌లతో ఇసుక లారీలు తిరుగుతుండడంతో రహదార్లు అధ్వానంగా తయారయ్యాయి. ఆర్‌అండ్‌బీ రహదారిపై తొలత చిన్న చిన్నగా ఏర్పడిన గుంతలు.. క్రమంగా పెద్దవిగా.. ఆపై ప్రమాదకరంగా మారాయి.

చర్ల మండలంలోని సుబ్బంపేట ఎదిరగుట్టల నుంచి రాళ్లగూడెం శివారు వరకు ఉన్న సుమారు 30 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షం కురిస్తే చెరువులను తలపిస్తున్నాయి. ఈ రహదారిపై పలు చోట్ల ఉన్న కల్వర్టులు, బ్రిడ్జిల సమీపాల్లో ఉన్న అప్రోచ్‌లు కృంగడంతో వాటి దగ్గరకు వచ్చేంత వరకు అవి కృంగినట్లుగా తెలియడం లేదు. దీంతో ఈ మార్గంలో కొత్తగా ప్రయాణాలు సాగించే ద్విచక్రవాహనదాలు, ఆటోవాలాలలు ప్రమాదాలకు గురయ్యి కింద పడుతూ తీవ్రంగా గాయాలపాలవుతున్నారు. పలు చోట్ల రహదారిపై ఉన్న గుంతలను తప్పించే సందర్భాల్లోనూ ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొంటూ ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో ద్విచక్రవాహనాలు, ఆటోలలో ప్రయాణించేందుకు జనం వెనుకంజ వేస్తున్నారు. గంటకో గంటన్నరకో వచ్చే ఆర్టీసీ బస్సుల కోసం ఎదురు చూస్తూ చేరాల్సిన గమ్యాలకు సకాలంలో చేరుకోలేక పోతున్నారు.

పైగా రహదారిపై భారీగా ఏర్పడిన గుంతల గుండానే నడుస్తున్న టాటా మ్యాజిక్‌లు, కార్లు, ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు మరమ్మతులకు గురవుతున్నాయి. సస్పెన్షన్లు పోవడం, టైర్లు త్వరగా అరిగిపోవడం, పంక్చర్లు అవ్వడం, బస్సులు, లారీలకు కట్టలు విరిగిపోవడం వంటివి జరుగుతున్నాయంటూ డ్రైవర్లు వాపోతున్నారు. రోడ్ ట్యాక్స్‌ల పేరిట లక్షలాది రూపాయలు గుంజుతున్న ప్రభుత్వాలకు రోడ్లకు కనీస మరమత్తులు చేయించాలన్న ఆలోచన లేకపోవడంపై తీవ్రంగా విమర్శిస్తున్నారు. గుంతలు చిన్నవిగా ఉన్నప్పుడే వాటిలో వెట్‌మిక్స్ గానీ, గ్రావెల్ వంటి పోసి పూడ్చితే సమస్య ఇక్కడి వరకు వచ్చేది కాదని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు స్పందించి ప్రమాదాలకు కారణాలు ఉన్న గుంతలను పూడ్చించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదాల బారిన పడుతున్నాం..



రోడ్లు సరిగా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతలు ఉన్న ప్రాంతాల్లో ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. టైర్లు పంక్చర్లు అవ్వడం, సస్పెన్సన్లు పోవడం, టైర్లు పగిలిపోవడం వంటివి జరుగుతున్నాయి.

– చింతల రాంబాబు, టాక్సీ ఓనర్, తేగడ

ఆలస్యంగా గమ్యస్థానాలకు..



రోడ్లు సరిగా లేక చేరాల్సిన గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోలేకపోతున్నాం. పన్నుల పేరుతో లక్షలాదిగా వసూలు చేస్తున్న ప్రభుత్వాలు ఈ రోడ్లకు మరమ్మతులు ఎందుకు చేయించరు. వెంటనే రోడ్లకు పూర్తి స్థాయిలో మరమత్తులు చేయించాలి.

– విజయకుమార్ నాయుడు, యూత్ కాంగ్రెస్ నాయకుడు, చర్ల

ప్రతిపాదనలు పంపించాం

భారీగా కురిసిన వర్షాల వల్ల భద్రాచలం వెంకటాపురం మార్గంలో చాలా చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. పలుచోట్ల రోడ్లు కృంగగా వాటిపై ఓవర్ లోడ్‌లను ఇసుక లారీలు తిరగడంతో రోడ్లు మరింతగా దెబ్బతిన్నాయి. రోడ్ల మరమ్మతుల కోసం మూడు నెలల క్రితమే ఎస్టిమేషన్లు పంపించాం. నిధులు మంజూరు కాగానే టెండర్లు పిలిచి పూర్తి స్థాయిలో మరమత్తులు చేయిస్తాం.

– హరిలాల్, డీఈ, ఆర్‌అండ్‌బీ శాఖ

ఎన్నికల నిబంధనలు పాటించండి



మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ రహెమాన్

చండ్రుగొండ: ప్రతి ఒక్కరూ ఎన్నికలు నిబంధనలు పాటించాలని డీఎస్పీ అబ్దుల్ రహెమాన్ అన్నారు. మండలంలోని గానుగపాడులో పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఎన్నికల నియమావళిపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గొడవలు, ఘర్షణలకు తావులేకుండా గ్రామాల్లో ప్రశాంత వాతావారణం ఉండేలా ప్రజలు సహకరించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే ఎంతటి వారిపైనైనా చట్టపర చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఎన్నికల ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని డీఎస్పీ కోరారు. ఈ సమావేశంలో జూలూరుపాడు సీఐ యం.శ్రీనివాసరావు, ఎస్సై మాచినేని రవి, పోలీసులు పాల్గొన్నారు.

ప్రజాపాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం

భద్రాచలంటౌన్: రాష్ట్రంలో ప్రజలు పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో విసుగు చెంది కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, ప్రజా పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని భద్రాచలం ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య అన్నారు. భద్రాచలం పట్టణంలోని సుందరయ్య నగర్ కాలనీకి చెందిన సుమారు 100 కుటుంబాలు మంగళవారం కాంగ్రెస్‌లో చేరగా ఆయన పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పదేళ్ల పాలనలో గ్యాస్ రూ.400లకు ఇవ్వాలని సీఎం కేసీఆర్‌కు ఎందుకు గుర్తుకు రాలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రకటించిన ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సరెళ్ళ నరేష్, టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్, చింతిరాల రవికుమార్, నాగ సతీష్, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దసరాలోపే చెల్లింపునకు కృషి



ఓసీ–2 గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నాయకుడు ప్రభాకర్‌రావు

మణుగూరుటౌన్: తెలంగాణ సీఎం కేసీఆర్ లాభాల్లో 32 శాతం ప్రకటించారని, ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో నిలిపిన వాటిని దసరాలోపే ఇప్పించే విధంగా టీబీజీకేఎస్ రాష్ట్ర నాయకత్వం కృషి చేస్తోందని ఆ సంఘం బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన ఓసీ–2లో జరిగిన గేట్ సమావేశంలో మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల సమష్టి కృషితో గడిచిన ఆర్థిక సంవత్సరం గణనీయమైన లాభాలు సాధించారని, టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రత్యేక చొవరతో దసరాలోపే లాభాల వాటా ఇప్పించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అయోమయానికి గురి చేస్తున్నాయని అటువంటి కార్మిక సంఘాల మాటలు నమ్మొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ అబ్దుల్ రవూఫ్, నాయకులు వీరభద్రయ్య, కాపా శివాజీ, వర్మ, వెంకటేశ్వరరెడ్డి, బానోత్ కృష్ణ, అశోక్, కృష్ణ.. రమణ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అడ్డాగా ప్రభుత్వ కార్యాలయం



మండల పరిషత్ కార్యాలయంలో కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీరామ్మూర్తి



కార్యాలయం వెలుపల అధికారులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

అశ్వారావుపేట: అశ్వారావుపేట మండల పరిషత్ కార్యాలయం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయమా? అనే సందేహాలు రేకెత్తుతున్నాయి. అధికార పార్టీ నాయకులు మండల పరిషత్ కార్యాలయాన్ని వారి పార్టీ కార్యాలయంలా వాడుకోవడం అశ్వారావుపేటలో పరిపాటే. కానీ ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక.. పోలింగ్ బూత్‌ల ఏర్పాట్లు, సరిహద్దు చెక్ పోస్టులు, తనిఖీలు జరుగుతూ ఎన్నికల వాతావరణంలోకి అడుగిడినంక కూడా అధికార పార్టీ నాయకులు అధికారులపై పెత్తనాన్ని చూపించడం మంగళవారం రాత్రి అశ్వారావుపేటలో చోటు చేసుకుంది. ఎంపీపీ అధ్యక్షుడు జల్లిపల్లి శ్రీరామమూర్తి చాంబర్‌లో కొందరు బీఆర్‌ఎస్ నాయకులు ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను సెంట్రల్ లైటింగ్ పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌ను పిలిపించారు. 'ఎన్నికలొచ్చేశాయ్, మీ పనులు మాత్రం పూర్తి కాలేదు. నియోజకవర్గ కేంద్రంలో ఇలా జాతీయ రహదారి తవ్వి వదిలేస్తే మా పరువేం కావాలి? సాధ్యాసాధ్యాలను తెలుసుకుని పనులు త్వరగా పూర్తి చేయండి. లేదంటే పైపూత పనులైనా చేసి సమస్యలను కప్పేయండి' అంటూ సూచనలు చేశారు. ఇక్కడి వరకు చర్చించింది ప్రజాసమస్యలే అయినప్పటికీ.. ఇవన్నీ మాట్లాడేటప్పుడు ఎంపీపీతోపాటు ఏ పదవీ లేని బీఆర్‌ఎస్ నాయకులు ఎందుకున్నట్లు? సమావేశానికి కాంట్రాక్టర్‌ను ఎందుకు పిలిపించినట్లు? అన్నదే అభ్యంతరకరం. ఏదేమైనా ఎన్నికల నియమావళి అశ్వారావుపేటలో ఇలా అమలవుతోంది.

అన్నదానం

గుండాల: గుండాల మండల కేంద్రంలో మంగళవారం దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని బతుకమ్మ ఘాట్ మాచర్ల రంజిత్ చందన దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా పీటలపై కూర్చున్న ఆ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: మండలంలోని పెద్ద బండిరేవు గ్రామానికి చెందిన విద్యార్థిని సోయం చోప్రా దేవికి కోర్సా వెంకటేశ్వరరావు అందజేసిన రూ.10వేలు ఆర్థికసాయాన్ని ఏఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. చోప్రా దేవి నాగర్ కర్నూల్ వ్యవసాయ విద్యా కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చరల్ మూడో సంవత్సరం చదువుతోంది. ఫీజు కట్టలేని పరిస్థితిలో కళాశాలకు వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉంటోంది. సమాచారాన్ని తెలుసుకున్న ఆదివాసీ సంఘాల నాయకుడు కోర్సా వెంకటేశ్వరావు ఆర్థిక సాయమందించారు. ఏఎస్పీ మండల అధ్యక్షుడు కురసం రవి, మిచ్చ దుర్గారావు, సోయం రవి, నరసింహారావు, ఏసుబాబు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

మణుగూరురూరల్: పోలవరం ప్రాజెక్ట్ బాధితులకు న్యాయం చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు బి.ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఉడతానేని గుంపు ప్రాంతానికి చెందిన పోలవరం ప్రాజెక్ట నిర్వాసిత బాధితులతో మాట్లాడారు. కార్యక్రమంలో దామల్ల రమేష్, రామయ్య, పద్మ, ముత్తయ్య, తాజు, బలరామ్ పాల్గొన్నారు.

ముగిసిన అప్రెంటీస్ మేళా



అప్రెంటీస్ మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్

బూర్గంపాడు: కృష్ణసాగర్ ప్రభుత్వ రెసిడెన్షియల్ ఐటీఐ కళాశాలలో రెండురోజులుగా నిర్వహించిన అప్రెంటీస్ మేళా మంగళవారం ముగిసింది. ఈ అప్రెంటీస్ మేళాలలో ప్రీమియం సోలార్ ఎనర్జీ లిమిటెడ్, ఫిమాకెమ్, లక్ష్మీనరసింహ ఇంజనీరింగ్ వర్క్స్ కంపెనీలు పాల్గొన్నాయి. అన్ని ట్రేడ్‌లకు కలిపి 98మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 59మందికి అప్రెంటీస్‌షిప్ లభించింది. అప్రెంటీస్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్, కొత్తగూడెం ప్రభుత్వ ఐటీఐ ట్రైనింగ్ ఆఫీసర్ రవీందర్ రెడ్డిలు అభ్యర్థులకు వివరించారు. కృష్ణసాగర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్, ట్రైనింగ్ ఆఫీసర్స్ ధర్మాచారి, జివెంకటేశ్వరరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థి ఎవరైనా గెలుపునకు కృషి

చండ్రుగొండ: పార్టీ అధిష్టానం అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా కాంగ్రెస్‌పార్టీ గెలుపు కోసం కృషి చేద్దామని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు వర్గీయులు ఐక్యతారాగం వినిపించారు.

రైతుబంధు మాజీ జిల్లా సమన్వయకర్త అంకిరెడ్డి కృష్ణారెడ్డి ఇంట్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ గుగులోతు బాబు, భోజ్యానాయక్, నల్లమోతు రమణలు మాట్లాడారు. ఈ నెల 19న అయన్నపాలెంలోని లక్ష్మీగార్డెన్స్‌లో కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు సమావేశాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. నాయకులు దారం గోవిందరెడ్డి, సారేపల్లి శేఖర్, రుక్మిణి, సొసైటీ చైర్మెన్ చెవుల చందర్‌రావు, అంతటి రామకృష్ణ, సంకా కృపాకర్ పాల్గొన్నారు.

అమ్ముడుపోయే వాళ్లను ఓడించండి



స్థానికులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు మచ్చా వెంకటేశ్వర్లు

చర్ల: పదవులు, డబ్బు కోసం అమ్ముడు పోయే నాయకులను ఎన్నికల్లో ఓడించి, నిరంతరం ప్రజా సమస్యల కోసం పోరాడుతూ ప్రజల మధ్యలో ఉండే వారిని గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని కుర్నపలి బోదనెల్లి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఓటర్లను సరుకుల్లా డబ్బు సంచులతో కొనుగోలు చేయాలనే తపనతోనే ఉన్నాయని, వారికి కనీస ప్రజాసేవ చేయాలని ఆలోచన లేదని విమర్శించారు. ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమానికి అండగా ఉంటున్న సీపీఎంను గెలిపించాలని ఆయన కోరారు. సమావేశాల్లో సీపీఎం నియోజకవర్గ కోకన్వీనర్ కారం పుల్లయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలగాని బ్రహ్మాచారి, మండల కార్యదర్శి కారం నరేష్, నాయకులు రేపాకుల శ్రీనివాస్, సాంబశివరావు, సోడి నాగేశ్వరావు, కనితి నర్సయ్య, బందెల చంటి, ఇర్పా సర్వేశ్వరావు, మడవి నగేష్, వర్సా రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి దరఖాస్తు

ములకలపల్లి: వైఎస్సార్‌టీపీ అశ్వారావుపేట నియోజకవర్గ అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ పార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి, జగన్నాథపురం మాజీ సర్పంచ్ సోయం కృష్ణ దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు బయోడేటా ఫారంతోకూడిన దరఖాస్తును మంగళవారం పార్టీ రాష్ట్ర విభాగం మహిళా అధ్యక్షురాలు గడపల్లి కవితతో కలసి హైదరాబాద్‌లోని వైఎస్సార్‌టీపీ కార్యాలయంలో అందజేసినట్లు సోయం కృష్ణ తెలిపారు.

గడప గడపకూ కాంగ్రెస్



మణుగూరుటౌన్: బీఆర్‌ఎస్ సర్పంచ్ తిరుపతమ్మకు ఆరు గ్యారెంటీలు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్: కాంగ్రెస్ పాలనలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని సాంబాయిగూడెంలోగడప గడపకూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టబోయే ఆరు గ్యారెంటీల వల్ల కలిగే లబ్ధిని వివరించారు. రానున్న ఎనినకల్లో కాంగ్రెస్ పార్టీదే ఆధికారమని అయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు గుండగాని నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ కంటెం సురేష్, సామా శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, రాజు, తిరుపతి రెడ్డి, తాటి భిక్షం, జమ్ముల రాఘవ రెడ్డి, పాతూరి వెంకన్న, దొడ్డపనేని మధు, కటుకూరి శ్రీను, కట్ట నర్సింహ, తమ్మిశెట్టి సాంబ, పాషా, సాధిని శంకర్ తదితరులు ఉన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని ములకనపల్లి, కొత్త గుంపు ఆదివాసీల గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న 6 గ్యారెంటీ కార్డులపై ప్రజలకు మంగళవారం వివరించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు కంగాల వెంకటేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోడి చంటి, నాయకులు సోడి సందేశ్వరరావు, సున్నం భద్రం, రాజ్ కొంద్రు, దుర్గారావు, కుంజ మల్లేష్, కొంద్రు రామ చంద్రయ్య, తుర్రం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా పలు పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారిని పార్టీ కండువకప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న అవతారాల్లో అమ్మవారు



దమ్మపేట: గాయత్రి ఆశ్రమంలో అన్నపూర్ణ దేవి రూపంలో దర్శనమిస్తున్న అమ్మవారు



అన్నపురెడ్డిపల్లి: గజలక్ష్మి అలంకరణలో..

అన్నపూర్ణాదేవిగా..

మణుగూరురూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గుట్టమల్లారం గ్రామంలో ఉన్న శ్రీపంచముఖ వేదగాయత్రీదేవి ఆలయంలో అమ్మవారి మంగళవారం అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమివ్వగా.. భక్తులు అమ్మవారికి ఆలయ అర్చకుల మంత్రోచ్ఛరణ నడుమ భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దయానిధి అక్కినేపల్లి వసంతాచార్యులు, అర్చకులు ప్రదీప్‌శాస్త్రి, భక్తులు బలుసు నాగసుజిత్–కనకాంజలి దంపతులు, శ్రీనివాస్‌రెడ్డి–అరుణ్‌జ్యోతి దంపతులు, నాగిరెడ్డి రమణమ్మ దంపతులు, నాదెండ్ల ముత్యాలరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: నవరాత్రుల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీగాయత్రి ఆశ్రమంలో అమ్మవారు, అన్నపూర్ణ దేవి రూపంలో భక్తులకు దర్శనమివ్వగా, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారికి కూరగాయలతో అర్చన, హోమం తదితర పూజా కార్యక్రమాలను ఆశ్రమ వ్యవస్థాపకుడు మూర్తిజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదాలను అందజేశారు.

అశ్వారావుపేటరూరల్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. మండల పరిధిలోని నారంవారి గూడెం కాలనీ(శ్రీరంగాపురం) వద్దగల శ్రీ విజయ భవాని అమ్మవారి ఆలయంలో, కొత్త మామిళ్లవారి గూడెం, వినాయకపురం, నారాయణపురం, అశ్వారావుపేటలో అమ్మవారు భక్తులకు అన్నపూర్ణ దేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, వివిధ రకాల నైవేద్యాలు సమర్పించారు.

గజలక్ష్మిగా..

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి అమ్మవారిని మంగళ గౌరిదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీగాయత్రి దేవిగా..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం శాంతినగర్ కాలనీలోని శ్రీ లలితా పరమేశ్వరి అమ్మవారు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ధనలక్ష్మిగా..

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీ నగరం గ్రామంలో ఉన్న కనకదుర్గమ్మ వారి దేవాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం అమ్మవారిని ధనలక్ష్మి అవతారంలో అలంకరించారు. ఆలయ అర్చకులు ఆరుట్ల రాజగోపాల్‌చార్యులు తెల్లవారుజామున శ్రీ కనకదుర్గమ్మ వారికి విశేష పంచామృత అభిషేకము నిర్వహించారు. అనంతరం ధనలక్ష్మి అవతారంలో అలంకరించి కుంకుమ పూజార్చన చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.